స్కెచ్

# భిన్న దృశ్యాలు

సురేంద్ర

"ఏమిటమ్మా శాంతా అలా ఉన్నావు?"

"ఏం ఎలావున్నానూ?"

"అబ్బా చెప్పవమ్మా ప్రాణంతీయక" విసుగుతోనే అడిగింది శాంత అత్తగారు.

"ఎప్పుడూ ఏముంటుంది చెప్పడానికి చచ్చిం..." రుసరుసలాడుతూ గదిలోకి వెళ్ళి తలుపువేసుకుంది. అత్తగారు ఆశ్చర్యంతో అలానే నిల్చుండిపోయింది. శాంత పద్దెనిమిదేండ్లు దాటకపోయినా బాగా వయసువచ్చిన పిల్లలాగానే వుంటుంది. కలవారింటి ఆడబడుచు కావటం వల్లనూ, కొద్దో గొప్పో విద్యాగంధం అమరివుండటవల్ల నేమో, సౌందర్యమెలావున్నా తీవికిమాత్రం లోపం వున్నట్లు కన్పించదు.

నాలుగేళ్ళనాడు శాంత పెళ్ళి తనుదగ్గిరుండి చేయించింది. ఆనాటి శాంత అమాయికత్వాన్ని గురించి పదేపదే ఆలోచించి శ్రీధర్ అదృష్టం ఊహించుకొని పొంగిపోయింది సంతోషంతో. తను కన్న కలలు ఫలించాయనీ, ఎలాగో ఓ లాగున ఆ మూడుముళ్ళూ వేయిస్తే తన బాధ్యత తీరిపోతుందనీ ఆశతో వివాహం తలపెట్టింది. అప్పటికది నిర్విఘ్నంగా కొనసాగటంతో తను మరింత గర్వపడింది.

...అప్పటికి పదేళ్లక్రిందట తన చెల్లెలి మరణశయ్యపై కూర్చుని వుండగా, అంచులెరుగక పొంగే విషాదసాగరంలో తలమున్కలువేస్తూ చెల్లెలికొడుకు ఎనిమిదేండ్ల పసివాడు. తనరక్షణ క్రింద పెంచి పెద్దజేసి, చెల్లిరుణం తీర్చుకోడానికి కారణభూతుడు అయిన శ్రీధర్ అమాయికంగా "అమ్మనుచూస్తే నాకు భయంగా వుందెందుకమ్మా?" అన్నమాటలు - ఇప్పటికి పదునాలుగేళ్లనాటిసంఘటన-ఆమెకన్నులముందు చిత్రంలా కనిపిస్తున్నది. పళ్లు కంపించి పోతున్నది.

అయినా తను చలించదు. తను అధైర్యపడితే రెండుజీవితాలు నాశనమౌతాయి. తన నిరంతర దీక్షా, జీవితాశయంకూడా విఫలమౌతాయి.

దగ్గరి బంధువులు, జరుగుబాటుకి లోటులేకపోవడమేగాక, పదిమందికి పెట్టగలిగినవాడు శ్రీధర్. అటు శాంతా వాళ్ళకికూడా దాదాపు పెద్ద భాగ్యవంతుల క్రిందనే లెక్కించవచ్చు. శ్రీధర్ బి. ఏ. చదువుతున్నాడు. నేడో రేపో ఉద్యోగంకూడా రావచ్చు. అటుశాంతకూడా స్కూలుఫైనల్ దాకా చదివినపిల్ల, సంగీతంకూడా వచ్చునట. ఇంకేం తను ప్రయత్నించడమే తడవుగా సంబంధాలు కుదరటం జరిగింది. పెళ్ళయి ఏడాది తిరగకముందే కొత్తజంట కాపురం. ఆమె ఆనందానికి మేరలేదు. దినమూ వీరిద్దరూ ఏవో పెద్దపెద్ద చర్చలు చేయడంచూచి మరీ గర్వించింది.

* * *

"శాంతా-అబ్బా శా-ం-తా" బాధతో పలవరించాడు శ్రీధర్. హీనస్వరంతో శరీరంలో ప్రతి నాడినుండి బయలు వెడలినట్లుగా నూతిలోనుండి అరచినంత హీనకంఠంతో పెకలించుకు అరిచాడు శ్రీధర్. "ఏం ఎవరూ లేరా?"అని.

"ఉన్నా నాన్నా వస్తున్నా" వణికిపోతూ మంచం చేరువకి వచ్చింది సీతమ్మగారు. ఆమె భయాందోళనలలో వణికే పెదవులనూ, వాలిపోయే రెప్పలక్రిందుగా చూచాడు శ్రీధర్. బరువుగా కన్నులు మూసుకున్నాయి. అలవాటు ప్రకారం రెండు బిందువులు తలగడపైకి జారాయి.

జీవితాన్ని పూర్తిగా అర్థంచేసుకుని జీవించాలనే ఆశతో, అలా జీవించి ఆనందించగలననే ఆశాపాశాన్ని పట్టుకు వ్రేలాడాడు కొన్నాళ్లు. అర్థం చేసుకున్నాడు-కాని ఆనందంకోసం కాకపోయినా అనుభవంకోసమైనా జీవించాలనుకున్నాడు కొన్నాళ్లు.

తను జీవించలేననీ, ఏనాడో మరణించాననీ–తన మరణించడమే గాక అందరికి మరణం సంప్రాప్తించేలాగా చేస్తున్నాననీ బాధతో చావు కోసం–ఈ నాటకంలో చివరి అంకంతో కడపటి నిష్క్రమణకోసం ఎదురుచూస్తూ కాలాన్ని వెళ్ళబుచ్చుతున్నాడు నేడు.

కాని తనూ అందరిలాగా ఓ అర్థాంగిని ఓ సౌందర్యలతను చేపట్టి సుఖసంతోషాలతో కాలం వెళ్ళదీయగలనే ఆశతో అలాదినమూ ఎదుర్కోగల సమస్యలను ఊహించుకుని అప్పుడే వాటి నెలా పరిష్కరించాలో గూడా ఆలోచించాలనే ఆసక్తితో నదిగట్టున కూర్చొని ఊహా చిత్రాలు నిర్మించాడు. తను కల్పించిన రూపాలు నేడు రంగులు మార్చుకుని, తలలూ పాదాలూ వోడు దుకులుగా ప్రత్యక్ష మౌతున్నాయి. బుర్ర తిరిగిపోతుంది. కన్ను తెరిచేసరికి అమ్మ కన్నీరు తుడుచుకుంటుంది.

* * *

అప్పుడే సంవత్సరం గడిచింది శ్రీధర్ ఎక్కడికో వెళ్ళి నెలరోజులకు తిరిగివచ్చాడు. వెళ్ళేనాడు తను లేను. అసలు తనేప్పుడంటే వెళ్ళేవాడే కాదుగూడా. శాంతా శ్రీధర్‌లని వుంచి తను స్వగ్రామం వెళ్ళింది. రెండుమూడుసంవత్సరాలుగా పరిష్కారం చేయవలసిన ఆస్తి విషయాలు తొందర పెట్టాయి.

తిరిగి వచ్చేసరికి పరిస్థితులు తారుమారయినవి. ఇల్లు పాడిపడిన గ్రహంలావుంది. ఒక్క శాంత మాత్రమే యింటివద్ద వుంది.

ఆరోజు.

"ఏం శాంతా అబ్బాయి యింటికి రాలేదేం?" రాత్రి పదిగంటలవేళ అడిగింది సీతమ్మగారు.

"నాకేం తెలుసు?" కాగడాలతో వెదికినా అర్థం కనిపించని వెంకి సమాధానం.

"రోజూ యింతవరకూ రాడా?" కోపమో పాడో అనుకుని తిరిగి ప్రశ్నించింది.

"ఇంతవరకే కాదు ఎంతవరకూ కూడా" వ్యంగ్యంగా.

"ఇదేం చిత్రమమ్మా" ఈ పరిస్థితులేవీ అర్థం కాక తను అన్నది. దినమూ ఓ యుగంలా గడుస్తున్న ఆ రోజుల్లో.

ఒకరోజున—

కుంభపోతగా వర్షం కురుస్తున్న అర్థరాత్రి. కన్ను మూసుకున్నా తెరచిచూచినా కాంతంటూ కనిపించని అంధకారం. వర్షపాతపు శబ్దముతప్ప మరేలాటిధ్వనీ లేదు. మేడమీద శాంత ఒక్కర్తే పడుకునివుంది. రేడియో ఆపడం మర్చిపోయింది గాబోలు ఏదో చిన్న అర్థంకాని శబ్దంమాత్రం వస్తున్నట్లుంది.

తన యింటి పరిస్థితులలో వచ్చిన ప్రమాదం గురించీ, పండంటి సంసారంలో కలిగిన భీభత్సం గురించీ, ఆలోచిస్తూ, ఆకాశంవంక ఏమీ కన బడకపోయినా చూస్తూ వసారాలోనే పడుకుని వుంది. కొంతసేపు గడిచాక దూరాన ఏవో మూలుగులు వినిపించాయి. ఏ కుక్కలో పాపం అనుకుని తత్వాలు తర్కించుకుంటూ నిద్ర పోయింది సీతమ్మగారు.

తెల్లవారింది. మెలుకువ వస్తున్న సమయంలో "చచ్చేవాళ్ళందరికీ యిదిగాదయ్యా స్థలం. ఇది యిల్లు తెలుసా–పదపద" కసురుకుంటున్న పని మనిషి ఎంకిమాటలు వినిపించాయి. సీతమ్మ మెత్తని హృదయానికి సూటిగా తగిలాయి మాటలు కత్తిపోట్లలాగ. పది నిముషాలు విరామం.

డాక్టరు రమాకాంతంగారు ఆశవుందనే చెప్పారు. ఆమెలో మోడుపోయిన శాంతి ఆనందం చిగిర్చాయి. కాని నాటికీనేటికీ తేడా లేదు. తడవకు కొన్ని కన్నీటిభాష్పాలు–రోజుకు కొన్ని బరువుగా నిట్టూర్పులు. క్షయరోగి మంచ మెక్కాడు శ్రీధర్.

* * *

"ఏమిటి శాంతా అలావున్నావ్?" మంచం మీంచి శ్రీధర్.

"మీరూ అదే ప్రశ్నా?" ప్రక్కనే కుర్చీలో కూర్చుని కొద్ది విసుగ్గా.

"ఏం తప్పా?"

"నేనెలావుంటే మీకేం–మీరు..."

"సుఖపడుతున్నానంటావు?"

"ఆమాట అనడంలేదు"

"మరి?"

"నేను సుఖపడుతున్నానంటాను."

"నిన్ను సుఖపెట్టలేకపోతున్నాను. నాకోసం నీవుకూడా—"

అసంపూర్తిగా ఆగిపోయింది గొంతుక.

గోడ దీపం మినుకు మినుకు మంటున్నది. శాంత అలాగే కూర్చునివుంది. తనుమాత్రం ఏం చేయగలదు? ఆలోచనలు పరిపరివిధాల పరువులిడుతున్నయ్. బాధలువున్న వారికి వెనుకటిస్మృతులు నెమరు వేసుకోవాలని వుండటం సహజం. కాని ప్రతివ్యక్తికీ జీవితంలో కొన్ని మధురస్మృతులుంటాయనే నమ్మకం మాత్రం శాంతకు లేదు. ముఖ్యముగా తనకు తను చిన్నప్పుడు ఏవేవో కలలు గన్నది. తను అనుభవించబోయేసుఖాన్ని దాన్ని అంటిపెట్టుకొని రాగల చిన్నచిన్న కష్టాల్ని మాత్రమే ఊహించుకుంటూ ఆనందపడింది. తన జీవితంలో ఆనందమంటూ ఎప్పుడైనా అనుభవించానని అనుకోవలసివస్తే అవి ఆరోజులుమాత్రమే తను ఊహాలు సాగించే రోజులే.

తనూ అందరిలాగా వుండాలనే ఆశించింది. అంతకంటే జీవితంలో ముందుకు పోనీలేమనీ నిరాశగాని, చేతగాని తనంగాని దరిజేరనీయకుండానే ఆలోచనలు చేయడం భవిష్యత్తు నిర్మించుకోవడము జరిగింది. తను ఊహించుకున్న పూలపందిరి వాడిపోయింది. తానొక ప్రత్యేకవ్యక్తి, స్వతంత్ర భావాలుంటయ్. తన అంతరాత్మ ఏంచెబితే అది తను అనుసరిస్తుంది. దేనికీ, ఎవరికీ లొంగవలసిన అవసరంలేదు. స్త్రీలోకంలోగల దౌర్భాగ్యాన్ని తను నిర్మూలించాలి. కనీసం తనవరకైనా శ్రీధర్ తననెందుకు శాసించాలి? నేను ఎర్రరంగుచీర కట్టుకుంటే ఏం? తనుచెప్పిన స్లిప్పర్సే ఎందుకు వేసుకోవాలి? ఆయన రమ్మన్న సినిమాకే తనెందుకు వెళ్ళాలి? ఈ సమస్య ఆమె ఆరక్షణంలో పరిష్కరించేది.

తన అభిప్రాయాల్ని గంటు వాయించినట్లు శ్రీధర్‌కు చెప్పింది. అవును తనెందుకూరుకోవాలి? తనేం చేతకానిదా? చదువుకున్న యువతి?

అతని మనసు విరిగినట్లుంది ఆనేభావం తనకు స్ఫురించకపోలేదు. కాని అందులో తన తప్పేమీ లేదు. అంతవరకూ తన అంతరాత్మ చెబుతుంది.

తనకసహ్యం. అలాంటివాళ్లతో తనెలా కాపురం చేయగలదు. నిజమే కాని అతనెందుకు తనకోసం ఎప్పుడూ ఎదురుచూస్తుంటాడు. పిచ్చివాడు -వాంఛకు దాసుడౌతాడు- ఆమాత్రం నిగ్రహంలేని అసమర్థుడు. ఛీ! తనెలా ప్రేమించగలదు?

* * *

"అమ్మా-శాంత" గొణిగాడు శ్రీధర్.

"డాక్టరు వద్దన్నాడు నాన్నా-ఆమె రాకూడదట. మీ స్నేహితుడు మూర్తి పదేపదేచెప్పాడు" అన్నది సీతమ్మగారు.

శ్రీధర్‌తో అబద్ధమాడవలసి వస్తుందని తను ఏనాడూ అనుకోలేదు. తన అంతరాత్మ వద్దంది. అయినా తను సమాధానపరిచింది.

పదేళ్లుగాని గేళ్ళు ప్రాణంగా పెంచుకుని తన జన్మ సాఫల్యంకోసం నీడగా, జాడగా, చూసుకునే మణిపూస శ్రీధర్ మంచికోసం. తప్పులేదు. నిజానికి శాంత ఊళ్ళో లేదు. అక్క కూతురి పుట్టినరోజు పండుగకు వెళ్ళింది. నేటికి పది రోజులు.

* * *

శ్రీధర్‌కు జబ్బు మరింత ఎక్కువయింది. ఏనాడు ఎలా వుంటుందోనన్న భయం వున్నది సీతమ్మగారికి. నాటి పరిస్థితి మరింత ఆందోళనకరంగా వుంది. డాక్టరుకూడా అదోలాగా చెప్పాడు.

"అమ్మా శాంత వచ్చిందికదూ?" నిశ్శబ్దాన్ని చీల్చుకుని విషాదంతో అల్లుకుపోయిన స్వరాలు సీతమ్మ హృదయానికి తాకాయి.

"........."

"శాంతా—అమ్మా అబ్బ..."

గాఢ నిద్రలోంచి ఒక్కసారి మేల్కొని సెలవు పుచ్చుకుని శాశ్వత నిద్రలోకి అడుగుపెట్టాడు శ్రీధర్. మాతృశ్రీ కన్నీరు జలజల రాల్చింది.